
# తెలంగాణ లెజెండ్

THE VOICE OF THE TELANGANA (ది వాయిస్ ఆఫ్ ది తెలంగాణ)....

తెలుగు దినపత్రిక

మహబూబ్ నగర్ | సంపుటి : 8, సంచిక : 174 | సోమవారం, జనవరి 12, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఉద్యోగాల ముసుగులో మోసం

# అంతర్జాతీయ ముఠా అరెస్ట్

- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల
- విదేశాలలో కాల్ సెంటర్ల ఏర్పాటు
- రూ. 547.00 కోట్ల కొల్లగొట్టిన మోసగాళ్లు
- 24 మందిపై కేసు నమోదు,18 మంది అరెస్టు
- సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి-సి పి సునీల్ దత్



ఉద్యోగ అవకాశాల పేరుతో నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని అంతర్జాతీయ సైబర్ ముఠాలు మోసాలకు పాల్పడుతున్నాయి. ఆకర్షణీయమైన జీతాలు, విదేశీ ఉద్యోగాలు అంటూ నమ్మించి బ్యాంక్ ఖాతాలు, వ్యక్తిగత వివరాలు దుర్వినియోగం చేస్తున్నారు. ఈ ముఠాలు దేశాల సరిహద్దులు దాటి డిజిటల్ నెట్‌వర్క్‌ల ద్వారా నేరాలకు పాల్పడుతూ కోట్ల రూపాయల మోసాలు చేస్తున్నారు. ఈ అంతర్జాతీయ సైబర్ నేరాలకు సంబంధించిన ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి అండ్ ముఠా దోపిడీ చేసిన నగదు మొత్తం రూ. 547.00 కోట్లుగా ఖమ్మం జిల్లా పోలీసులు తేల్చారు. ఈ ముఠా సైబర్ దోపిడీకి సహకరించిన మొత్తం 18 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పెనుబల్లి పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

**ఉద్యోగాల కల్పన పేరుతో వల ..**

సీపీ సునీల్ దత్ వెల్లడించిన వివరాల ప్రకారం. గత నెల 24వ తేదీన సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన పేరుతో వల విసిరి ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రకాష్, మేడా సతీష్, మోరంపూడి చెన్నకేశవ అనే వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడ్డారు. ఈ ముఠా నిరుద్యోగుల నుండి రూ. 547.00 కోట్ల భారీ మొత్తాన్ని కొల్లగొట్టారని గుర్తించామన్నారు. కేసు విచారణలో భాగంగా నిందితులైన ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్ ల కుటుంబ సభ్యుల, అనుచరుల బ్యాంక్ అకౌంట్లను పోలీసులు పరిశీలించగా ఆశ్చర్యం కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. పోట్రు మనోజ్ కళ్యాణ్ బ్యాంకు ఖాతాలో రూ. 114.18 కోట్లు, అతని భార్య మేడా భానుప్రియకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల్లో రూ. 45.62 కోట్లు, మనోజ్ కళ్యాణ్ బావ మరిది మేడా సతీష్ ఖాతాలో రూ. 135.48 కోట్లు, బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ. 81.72 కోట్లు జమ చేశారు. కరీంనగర్ కు చెందిన తాటికొండ రాజు అనే వ్యక్తికి చెందిన నరసింహా కిరాణం అండ్ డెయిరీ ఖాతాలో రూ. 92.54 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ. 80.41 కోట్ల చొప్పున లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సత్తుపల్లి పరిసర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులను ఉద్యోగాల కల్పన పేరిట మోసానికి పాల్పడ్డారు.

# 'అరైవ్ అలైవ్' కు నేడు సీఎం శ్రీకారం

- రోడ్డు భద్రతకు కొత్త దిశ
- సురక్షిత ప్రయాణమే సంకల్పం గా రోడ్ సేఫ్టీ ఉద్యమం
- ఈ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- పత్రికా ప్రకటనలో వెల్లడించిన డిజిపి బి.శివధర్ రెడ్డి.




**హైదరాబాద్, జనవరి 12:**

తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలను గణనీయంగా తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ ప్రచార కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ రోజు యూసుఫ్‌గూడాలోని ఇండోర్ స్టేడియంలో పాల్గొంటారని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రచారం జనవరి 13 నుంచి 24 వరకు పండుగ సెలవులు మినహా పది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు డిజిపి వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను గణనీయంగా తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డిజిపి పేర్కొన్నారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత ప్రతి తెలంగాణ పౌరుడి మనసులో బలంగా నాటిపోవాలన్నదే 'అరైవ్ అలైవ్' ఆశయమని చెప్పారు. ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి సీనియర్ అధికారుల నుంచి చివరి స్థాయి పోలీసు సిబ్బంది వరకు అందరూ పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు. ఈ ప్రచారం ద్వారా ప్రజల్లో ప్రవర్తనా మార్పు తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం, డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని సంస్థాగతంగా నెలకొల్పడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని డిజిపి పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, సెలబ్రిటీలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్లు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖలు, న్యాయవ్యవస్థల భాగస్వామ్యంతో తెలంగాణను దేశానికి ఆదర్శ రోడ్డు భద్రతా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ముఖ్యంగా పిల్లియన్ రైడర్లు కూడా హెల్మెట్ పెట్టుకోకపోవడం, ముందు- వెనుక సీట్లలో సీటుబెల్ట్ వినియోగం లేకపోవడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం గురించి తెలుపనున్నాను.

# పైపుల దొంగతనాల ముఠా అరెస్ట్

**రూ. 13 లక్షల విలువైన పైపుల రికవరీ**




పరిగి, వికారాబాద్ ప్రాంతాలలో వరుసగా డి ఐ పైపుల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పరిగి పోలీసులు పట్టుకున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్ వెల్లడించారు. ఈ కేసు వివరాలను తెలియజేస్తూ, గతేడాది డిసెంబర్ 06న పరిగి – కోడంగల్ రోడ్డులోని న్యూ బ్రిలియంట్ స్కూల్ సమీపంలో అమృత్ 2. ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 13 లక్షల రూపాయల విలువైన 115 డి ఐ పైపులు దొంగతనానికి గురయ్యాయని తెలిపారు. ప్రాజెక్ట్ మేనేజర్ మంగపట్నం వెంకటరమణ ఫిర్యాదు మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేయగా, కేసు తీవ్రతను బట్టి పరిగి సిఐ దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. నేర పరిశోధనలో భాగంగా సిఐ సీసీటీవీలు, టెక్నికల్ ఆధారాలు అనాలిసిస్ చేయగా, దొంగతనానికి టి ఎస్ 07 యు కె 2448 నంబర్ గల డీసీఎం వాహనాన్ని వాడినట్లు గుర్తించారు. ఆదివారం (జనవరి 11) తెల్లవారుజామున 4 గంటల సమయంలో బ్రిలియంట్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు గత ఆగస్టు నెలలో పరిగిలో పైపులను దొంగిలించి హైదరాబాద్‌లోని నాచారం మరియు టోలిచౌకి ప్రాంతాల్లో విక్రమ్ గోయెల్, సుల్తాన్ భాయి, శివరాత్రీ రాజు అనే వ్యక్తులకు అమ్మినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేవలం పరిగిలోనే కాకుండా, ఈ ముఠా గత నవంబర్ నెలలో వికారాబాద్ యెన్నెపల్లి

# ఉడిత్యాల గ్రామ అభివృద్ధి శ్రీధర్ గౌడ్ తో సాధ్యం

**స్థానిక ఎన్నికల్లో సర్పంచ్ గా గెలుపొందడం పట్ల అభినందించిన అభిమన్య**



**బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :**

ఉడిత్యాల గ్రామ అభివృద్ధి సక్కెర శ్రీధర్ గౌడ్ తో సాధ్యమవుతుందని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు చించోడ్ అభిమన్యు రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామ పంచాయతి గ్రామ సర్పంచిగా ఘన విజయం సాధించిన సక్కర శ్రీధర్ గౌడ్ ఆదివారం జడ్చర్ల బీ ఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి హైదరాబాద్ లోని తన నివాసం లో శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉడిత్యాల ఉప సర్పంచ్, వార్డు సభ్యులను కూడా అభినందించారు. కార్యక్రమములో సక్కెర నవీధర్, సక్కర సాయి ధర్ శేఖర్, శంకర్, రామకృష్ణ, యాదయ్య ,పీజీ లింగం యాదవ్, లింగం యాదవ్, యాదయ్య, బోయ కృష్ణ,రాజశేఖర్, నరేష్,భాస్కర్ తధితరులు పాల్గొన్నారు.

# సిసిఆర్బి ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సిసిఆర్బీ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ సెక్షన్ల వారిగా పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధుల వివరాలతో పాటు, వారు నిర్వహిస్తున్న రికార్డులు, అందులో నమోదు చేసిన వివరాలను సంబంధిత సంబంధిత సెక్షన్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ కమిషనర్, రౌడీ షీట్లు, జైల్ రిలీజ్, ఎస్సీ, ఎస్.టి, మిస్సింగ్, యం. సి.ఆర్ , విచారణలు, చోరీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, నేరాలు,మహిళలపై నేరాలకు సంబంధించి రికార్డుల నిర్వహణపై పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ తనిఖీల్లో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు డేవిడ్ రాజు, జనార్ధన్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్, సంజీవ్, మల్లయ్య, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రావు తో సిసి ఆర్బీ విభాగం ఎస్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చైనా మాంజా విక్రయంపై ఉక్కుపాదం

- మాంజా ను వినియోగిస్తే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా దుకాణాలు, స్టేషనరీల పై ఆకస్మిక తనిఖీలు



నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం చైనా మాంజా (చైనీస్ నూలు / నైలాన్ మాంజా) విక్రయాలపై జిల్లా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలు, స్టేషనరీ షాపులు, ఇతర విక్రయ కేంద్రాలలో నిషేధిత మాంజా విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై విస్తృతంగా పరిశీలించారు. చైనా మాంజా వినియోగం ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదకరమని, గతంలో పక్షులు, వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణ నష్టం కూడా సంభవించిన సందర్భాలు ఉన్నాయని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం




రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో "పోలీసులు మీకోసం" కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల సంక్షేమానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా గారి ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ శ్రీ భాస్కర్ గారు, జైపూర్ ఏసీపీ శ్రీ వెంకటేష్ గారి నేతృత్వంలో గత నెల నీల్వాయి మండలంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని చెన్నూర్ రూరల్ సీఐ శ్రీ బన్సీలాల్ మరియు నీల్వాయి ఎస్ఐ శ్రీ జగదీశ్వర్ రెడ్డి సమన్వయంతో నిర్వహించగా, మంచిర్యాల కంటి శస్త్ర వైద్యుల బృందం ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించబడ్డాయి.

# రాత్రంతా రోడ్లపైనే పోలీస్..




బండి వెనుక బండి ఆంధ్రాకు పోతుంటే రహదారిపై ప్రవాహం వెళుతున్నట్టుంది హైద్రాబాద్ – విజయవాడ రహదారి. సంక్రాంతి పండుగకు ఆంధ్ర ప్రాంతానికి సూర్యాపేట మీదుగా వెళుతున్న వాహనదారులకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రత రక్షణ కల్పిస్తుంది. సంక్రాంతి అంటే ఆంధ్రా ప్రాంతంలో అతి పెద్ద ఉత్సవం, ప్రక్రుతికే అందం వస్తుంది. హైదరాబాద్ మహానగరం ఆంధ్ర ప్రాంతానికి పయనం అవుతుంది ఈ క్రమంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలకు సూర్యాపేట జిల్లా ముఖద్వారం గా ఉంది సుదీర్ఘమైన జాతీయ రహదారి ఆంధ్ర ప్రాంతానికి వెళ్తుంది సుమారు నిమిషానికి 80 కి పైగా వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. ఈ క్రమంలో వాహనదారులకు ప్రజలకు మెరుగైన భద్రత రక్షణ కల్పిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించడం పోలీస్ శాఖకు ముందున్న సవాలు.

# తెలంగాణ జైళ్ల శాఖ వార్షిక ప్రెస్ మీట్ కు ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర జైళ్ల ఆధ్వర్యంలో వార్షిక ప్రెస్ మీట్–2026ను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎలకానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు జైళ్ల శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ మీడియా సమావేశంను నేడు అనగా 12 జనవరి 2026 న ఉదయం 11:30 గంటలకు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ లో నిర్వహించనున్నారు. గత ఒక సంవత్సర కాలంలో తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన ముఖ్యమైన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలు, అలాగే ఖైదీల పునరావాసం, శిక్షాసంస్కరణ సేవల సమర్థత పెంపుదల దిశగా అమలు చేస్తున్న వ్యూహాత్మక చర్యలపై ఈ ప్రెస్ మీట్‌లో సమగ్ర సమాచారంను అందించనున్నారు. ఈ వార్షిక ప్రెస్ మీట్ లో డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ & కరెక్షనల్ సర్వీసెస్, తెలంగాణ ముఖ్య అతిథిగా హాజరై మీడియాను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సేవా భావానికి నిదర్శనం



హైదరాబాద్ :
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వినూత్న ఆలోచనలు, సేవా ఆశయాలతో ముందుకు సాగుతున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ౖ తెలంగాణ రాష్ట్ర శాఖ మరోసారి తన సేవా భావాన్ని చాటుకుంది. సంస్థకు చెందిన సభ్యుల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా ఆదుకోవాలన్న సంకల్పానికి నిదర్శనంగా, ఇటీవల మృతి చెందిన మహేష్ కుటుంబానికి కొంత మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నిర్ణయం సభ్యుల మధ్య ఐక్యతను, పరస్పర బాధ్యతను ప్రతిబింబిస్తుందని పలువురు ప్రశంసించారు. ఈ సేవా కార్యక్రమానికి మార్గనిర్దేశం చేసి, అందరినీ ఆలోచింపజేసిన రాష్ట్ర అధ్యక్షులు సర్వేందర్ కు, అలాగే స్టేట్ చైర్మన్ , మరియు జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు అశోక్ కుమార్ ముదిరాజ్ కు సంస్థ ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చొరవతో ముందుకు నడిపించిన స్టేట్ స్పోక్స్ పర్సన్ & ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కొమ్ము వెంకన్న బాబు ను హ్యూమన్ రైట్స్ కమిషన్ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరించేలా ఆదర్శంగా నిలుస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి పదవి పట్ల హర్షం



**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :**
రంగారెడ్డి జిల్లా సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోటిక గోపాల్ రెడ్డినీ ఎంపిక చేయడం పట్ల చించోడు ఉపసర్పంచ్ రాజేందర్ రెడ్డి తదితర మిత్ర బృందం ఘనంగా సన్మానించారు. సామాజికపరంగా ఎంతో సహకరిస్తూ ఈ ప్రాంతంలో అందరికీ సేవలు అందిస్తూ రాజకీయంగా అదేవిధంగా సర్పంచుగా మరోవైపు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడుగా తన సేవలను విస్తృతం చేస్తున్న తీరు అభినందనీయమని పలువురు కొనియాడారు. మిత్రబృందం ఆధ్వర్యంలో గోపాల్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

# నిన్న సందర్శన నేడు కార్యరూపం!



**కొందుర్గు జనవరి 11(తెలంగాణ లెజెండ్):**
–గ్రామీణ ప్రజల సమస్యలపై నిన్న స్పందన, నేడు పరిష్కారం చూపిస్తూ ప్రజాసేవ అంటే ఇదేనని నిరూపిస్తున్నారు బోడంపాటి రవీందర్ రెడ్డి. మాటలకే పరిమితం కాకుండా చేతలతోనే సమాధానం చెప్పే ఆయన సేవా ధోరణి మరోసారి ప్రజల మనసులను గెలుచుకుంది. రాంచంద్రపూర్ గ్రామంలోని అంగన్వాడీ భవనాన్ని నిన్న సందర్శించిన సర్పంచ్ రవీందర్ రెడ్డి, అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, మరమ్మతుల పనులకు శ్రీకారం చుట్టడం విశేషం. చిన్నారుల భవిష్యత్తుకు పునాది అయిన అంగన్వాడీ కేంద్రాన్ని మెరుగుపరచాలన్న ఆయన సంకల్పానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ”సంచిలో చేయి పెడితే సబ్సిడీ బియ్యం తగిలేదీ వాడే కంచిలో కాలెడితే ప్రాయశ్చిత్తం చేసుకుంటున్న పాపంలా గొణిగేదీ వాడే” అంటూ ప్రజలు అభివర్ణించే స్థాయికి ఎదగడం ఆయన సేవా బాటకు నిదర్శనం. ఒక్క గ్రామంలోనే కాదు, ఊరూరా వినిపించే పేరు, నోరారా పలకరించే మనిషిగా రవీందర్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అంతేకాకుండా కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు టెంట్ హౌస్ కోసం ఆర్థిక సహాయం అందిస్తూ, యువత క్రీడా కార్యక్రమాలకు తన వంతు మద్దతు ప్రకటించారు. అలాగే ఉమ్మెంతాల్ గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు మొదటి బహుమతిని ప్రకటించి అందజేయడం ద్వారా యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ… పదవులు, హోదాలు లేకున్నా ప్రజలు అడుగడుగునా పబ్బం కట్టే స్థాయిలో సేవ చేస్తున్న వ్యక్తి రవీందర్ రెడ్డి అని కొనియాడారు. ఇలాంటి వ్యక్తులకు దేవుడు మరింత ఆర్థిక బలం, అవకాశాలు ఇవ్వాలని ఉమ్మడి మండల ప్రజా నాయకులు, యువకులు, గ్రామస్తులు ఆకాంక్షించారు. ప్రజల కోసం నిరంతరం ఆలోచిస్తూ, అవసరమైన చోట తక్షణమే స్పందిస్తున్న గౌరవ శ్రీ బోడంపాటి రవీందర్ రెడ్డి గారికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాసేవే లక్ష్యంగా, మానవత్వమే మార్గంగా ముందుకు సాగుతున్న ఆయన బాట రేపటి నాయకత్వానికి దిశానిర్దేశం చేస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# యువతే లక్ష్యంగా సేవలు



**కొందుర్గు జనవరి 11(తెలంగాణ లెజెండ్):**
కొందుర్గు మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 19వ ఆల్ ఇండియా వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాభిమానుల్లో విశేష స్పందన పొందుతోంది. ఈ టోర్నమెంట్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతమైన జట్లు పాల్గొంటుండటంతో కొందుర్గు మండలం క్రీడా వేదికగా మారింది. ఈ నేపథ్యంలో టోర్నమెంట్‌కు రెండవ బహుమతిగా రూ.25,000 నగదు బహుమతి అందించేందుకు కే.కే. కన్స్ట్రక్షన్స్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు కే.కే. కృష్ణ దాతగా ముందుకు రావడం అభినందనీయమని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కే.కే. కృష్ణ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌కు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కే.కే. కృష్ణ సహకారం టోర్నమెంట్‌కు మరింత ప్రతిష్ట తీసుకువచ్చిందని తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# జోగు యాదయ్య కుటుంబాన్ని పరామర్శించిన బి.ఆర్.ఎస్ నాయకులు



**జిల్లేడు చౌదరిగూడ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి:**
జిల్లేడు చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త యాదయ్య తండ్రి జోగు చిన్నయ్య ఇటీవల చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ గారు స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి చిన్నయ్య స్వగృహానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు.

# అసాంఘీక కార్యకలాపాల పై నిఘా



నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో పేకాట , కోడిపందాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నిరంతర వాహన తనిఖీలు,సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించబడిన కొన్ని ప్రదేశాలలో గస్తీని ముమ్మరం చేయడం జరిగిందని తెలిపారు. మహారాష్ట్ర మరియు నిజామాబాదు కు చుట్ట సరిహద్దు పోలీస్ స్టేషన్లలో పనిచేసే అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. పట్టుబడిన నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులందరికి ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని తెలియజేశారు. అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు.

# హరిలో రంగ హరి..! డ్రగ్స్ బారిన పడితే జీవితం హరి హరి!!



”హరిలో రంగ హరి” అంటూ వీధుల్లో వినిపిస్తున్న భజన స్వరం నేడు భక్తిని మించి ఒక బలమైన సామాజిక సందేశంగా మారింది. సంప్రదాయ హరిదాసు వేషధారణలో ప్రజల మధ్యకు వెళ్లి మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించే వినూత్న కార్యక్రమం ప్రజల మనసులను కదిలిస్తోంది. పసుపు వస్త్రాలు, రంగురంగుల కిరీటం, మెడలో తులసి మాలలు, చేతిలో చిప్పతో హరిదాసు వేషంలో డ్రగ్స్ పైన అవగాహన కల్పిస్తున్నారు. సమాజమే పాఠశాలడ్రగ్స్‌పై పోరాటమే పాఠం.. ఆదర్శంగా నిలుస్తున్న టీచర్‌గా ప్రభాకర్ సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్, తరగతి గదికే పరిమితమవకుండా సమాజాన్ని తన పాఠశాలగా మార్చుకున్నాడు. స్కూల్ టీచర్‌గా విద్యాబోధన చేయడమే కాకుండా, సామాజిక కార్యకర్తగా డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ యువతను సరైన దారిలో నడిపించేందుకు ఆయన చేస్తున్న కృషి నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. డ్రగ్స్ నియంత్రణ లేకపోతే యువత పెడదారిపడుతుందని, దాంతో కుటుంబ వ్యవస్థ కూలిపోతుందని, సమాజం మొత్తం నైతిక పతనానికి లోనవుతుందని ప్రభాకర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ ఆలోచనలే ఆయనను సామాజిక బాధ్యత వైపు నడిపించాయి. తన సొంత డబ్బులతోనే డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ప్రజల దృష్టిని ఆకర్షించేలా వినూత్నమైన పద్ధతులను అవలంబించడం ప్రభాకర్ ప్రత్యేకత. ఒకసారి యమధర్మరాజు వేషంలో బర్రెను వెంట తీసుకెళ్లి, “డ్రగ్స్‌కు బానిసైతే యమలోకానికి దారి తీస్తాయి” అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. ఆ కార్యక్రమం




అప్పట్లో గ్రామాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. ఈసారి సంక్రాంతి పండుగ సందర్భంగా హరిదాసు వేషధారణలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ మరోసారి తన ప్రత్యేక శైలిని చాటుకున్నారు. “హరిలో రంగ హరి డ్రగ్స్ వాడితే జీవితం హరి హరి” అంటూ భజన పాటలతో పాటు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను హృదయాన్ని తాకేలా వివరిస్తున్నారు. సంక్రాంతి పండుగ సెలవులు అయినప్పటికీ, ఇతరులు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ప్రభాకర్ మాత్రం సెలవులను పక్కనపెట్టి సామాజిక బాధ్యతను భుజాలపై వేసుకున్నారు. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఒకే రోజు ప్రైవేట్ వాహనాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుని తిరుగుతూ ప్రజల్లో అవగాహన కల్పించడం ఆయన త్యాగ భావానికి నిదర్శనం. ఈ ప్రయత్నాన్ని గమనించిన ప్రజలు మాత్రమే కాదు, పలువురు ప్రభుత్వ అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభాకర్ లాంటి ఉపాధ్యాయులు నిజంగా “గురువు” అనే పదానికి అర్థం చెబుతున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒకరికి అయినా డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తే, అదే సమాజానికి చేసిన గొప్ప సేవ అవుతుంది. విద్యతో పాటు విలువలను, ఉపదేశంతో పాటు ఉదాహరణను చూపించే ప్రభాకర్ వంటి వ్యక్తులే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి నిజమైన బాట చూపిస్తున్నారు.

# ”క్రమశిక్షణకు క్రీడలు బలం ఐక్యతకు ఆటలు ఆధారం”



2వ బెటాలియన్‌లో ఇంటర్ కంపెనీ వార్షిక క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ క్రీడా వేడుకలకు ముఖ్య అతిథిగా శ్రీ రాథోడ్ దేవిదాస్ అడిషనల్ కమాండెంట్ గారు హాజరై క్రీడలను ప్రారంభించారు. బెటాలియన్‌లోని వివిధ కంపెనీలకు చెందిన సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాథోడ్ దేవిదాస్ గారు మాట్లాడుతూ, పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అలాగే క్రీడలు సిబ్బందిలో ఐక్యత, స్నేహభావం, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంచుతాయని తెలిపారు. ఈ క్రీడా సమారోహం సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా వేడుకలను విజయవంతం చేశారు.

# బాక్సింగ్ రింగ్‌లో మెరిసిన ధీరవనిత: షేక్ సల్మా బేగం



తను ఎంచుకున్న వృత్తిలో శాంతిభద్రతలను కాపాడుతూనే, మరోవైపు బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు షేక్ సల్మా బేగం. 2012లో పోలీస్ శాఖలో అడుగుపెట్టినప్పటి నుండి, విధి నిర్వహణలోనూ మరియు క్రీడారంగంలోనూ ఆమె అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. షేక్ సల్మా బేగం ఇఅ హెడ్‌క్వార్టర్స్ విభాగంలో మహిళా కానిస్టేబుల్ (2546) గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2012 ఫిబ్రవరి 12న పోలీస్ శాఖలో చేరిన ఆమె, అదే ఏడాది తన బాక్సింగ్ ప్రయాణాన్ని కూడా ప్రారంభించారు. అప్పటి నుండి కఠినమైన శిక్షణతో బాక్సింగ్‌లో రాణించారు. జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో తన సత్తా చాటి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోలీస్ మీట్ లో పోలీస్ స్టేట్ మీట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి బంగారు పతకాలను సాధించారు. జిల్లా స్థాయి క్రీడల్లోనూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించి స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. జాతీయ స్థాయి ఓపెన్ పోటీల్లో కూడా పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఒక మహిళా పోలీస్ అధికారిగా క్లిష్టమైన బాధ్యతలు నిర్వహిస్తూనే, బాక్సింగ్ వంటి శారీరక శ్రమతో కూడిన క్రీడలో పతకాలు సాధించడం సామాన్యమైన విషయం కాదు. ప్రస్తుతం ఆమె బాక్సింగ్ ఆడకపోయినప్పటికీ, ఆమె సాధించిన పతకాలు మరియు ఆమె కనబరిచిన క్రీడా స్ఫూర్తి నేటి యువ పోలీసులకు మరియు క్రీడాకారులకు ఎంతో ఆదర్శం. రింగ్‌లో ఆమె పంచ్‌లు ఎంత పవర్‌ఫుల్‌గా ఉండేవో, ఆమె కెరీర్ గ్రాఫ్ కూడా అంతే స్ఫూర్తిదాయకంగా ఉంది.

# దోపిడి కేసును చేదించిన టూ టౌన్ పోలీసులు

శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని మార్కెట్ యార్డ్ వద్ద బాధితుడు మునేశ్వర్ గౌరవ్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ముగ్గురు తెలియని నిందితులు ఒక వాహనంపై వచ్చి అతనిని అడ్డుకొని బలవంతంగా అతని వద్ద ఉన్న 1050 రూపాయలను సెల్ఫోన్ లాక్కొని పారిపోయారు. మరుసటి రోజు అనగా ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసు యంత్రాంగం హుటాహుతిన నిందితులను గుర్తించి గంటలోపు వారిని పట్టుకోవడం జరిగింది. నిందితులు 1) గజ్బే కరణ్ (27) / సంజయ్, వెల్డింగ్ వర్కర్, నెహ్రూ చౌక్. 2) షేక్ మోయిన్, డాల్డా కంపెనీ ఏరియా. 3) అర్బాజ్ ఖాన్ (21), కుర్షిత్ నగర్. లుగా గుర్తించడం జరిగింది. జల్సా లకు అలవాటు పడి నేరాన్ని చేయడం జరిగింది అని తెలిపారు. వారి వద్ద నుండి దోపిడీ చేసిన డబ్బు నుండి వెయ్యి రూపాయల నగదు, సెల్ఫోన్, దోపిడీకి యత్నించిన వాహనాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురి పై ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. గంటలోపు చేదించిన కారణంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.